సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 9 । మార్చి । 2025



6053 కేసులు పరిష్కారం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి 6053 కేసులు పరిష్కరించారు.

-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది॥ (సా॥)	సహార్ సోమ॥ (ఉ॥)
కడప	6.30	5.11
పులివెందుల	6.32	5.16
ప్రొద్దుటూరు	6.31	5.15

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.4/18.1

జిల్లాలో శనివారం 18.1 – 38.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించిన మ్యాథ్స్ -1బీ, హిస్టరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 16240 మంది విద్యార్థులకుగాను 15633 మంది హాజరయ్యారని ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఇందులో జనరల్‌కు సంబంధించి 14720 మందికిగాను 14238 మంది, ఒకేషనల్‌కు సంబంధించి 1520 మందికిగాను 1395 మంది హాజరయ్యారని ఆర్ఐఓ తెలిపారు.

రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగాలలో వివిధ హోదాలలో నియమిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీలుగా జి. క్రిష్ణవేణిరెడ్డి, మూలే సరస్వతి దేవి, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శులుగా ఎం. రామమోహన్‌రెడ్డి, ఎస్. వీర గంగుల వీర ఆంజనేయులు, కార్యదర్శిగా రాయల్‌బాబు, రాష్ట్ర మేధావుల ఫోరం ప్రధాన కార్యదర్శిగా వీవీ సుబ్రమణ్యం రావు, కార్యదర్శులుగా పోచిమరెడ్డి సుబ్బారెడ్డి, ఓ. వేణుగోపాల్‌లను నియమించారు.

నేడు అవగాహన సదస్సు

కడప కల్చరల్: భారత జాతీయ కళాసంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇన్‌టాక్)ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఇన్‌టాక్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి వెల్లడించారు. ప్రముఖ ఆహార ఆరోగ్య శాస్త్రవేత్త పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ ప్రధాన వక్తగా హాజరై ,చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలపై సంపూర్ణ అవగాహన కల్పిస్తారని ఆయన వివరించారు. కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్ తదితరులు అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

‘యువత పోరు’ను
విజయవంతం చేద్దాం

- 12నే పార్టీ ఆవిర్భావ వేడుకలు... భారీ ర్యాలీ
- ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి పక్షపాతం చూపడం దారుణం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి . చిత్రంలో అంజద్‌బాషా, సురేష్‌బాబు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఈనెల 12వ తేది నిర్వహించ తలపెట్టిన ‘యువత పోరు’కు విద్యార్థులు, యువత తరలిరావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్ర నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 12వ తేది ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసిన అనంతరం కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేస్తామని వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మెగా డీఎస్సీ నిర్వహిస్తామని, ఏడాదికి 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయడం లేదన్నారు. వలంటీర్లకు పదివేలు ఇస్తామని హామీ ఇచ్చి, వారి ఉద్యోగాలనే ఊడబెరికారన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్లు తప్పా మరేమీ ఇవ్వడం లేదని, అందులో కూడా వివిధ సర్వేల ద్వారా 3లక్షల పింఛన్లు తొలగించారని ధ్వజమెత్తారు. 2019లో చంద్రబాబు బకాయి పెట్టిన రూ.1800కోట్ల బకాయిలను వైఎస్ జగన్ ప్రభుత్వం తీర్చిందని, చంద్రబాబు మాత్రం గత ప్రభుత్వం దిగిపోయే నాటికి ఉన్న రూ.3900కోట్ల బకాయిలను చెల్లించడం లేదన్నారు.ఈ ప్రభుత్వం వచ్చాక స్త్రీ నిధి నుంచి కళ్యాణ లక్ష్మి పథకానికి నిధులు వాడుకోవాలని యోచించడం దారుణమన్నారు. టీడీపీ కార్యకర్తల సంపాదన కోసమే ఈ ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. రాగద్వేషాలకు అతీతంగా పనిచేస్తానని ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన చంద్రబాబు... టీడీపీ వారికే పనులు చేయండి, వైఎస్సార్‌సీపీ వారి కి చిన్న పని కూడా చేయొద్దు అని చెప్పడం దారుణమన్నారు. టీడీపీ కార్యకర్తలే మీకు ఓట్లు వేశారా...ప్రజలెవరూ వేయలేదా ముఖ్యమంత్రి స్థాయి ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడవచ్చా...అని ప్రశ్నించారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం కాకుండా మరే ప్రభుత్వం ఉన్నా ఈ ప్రభుత్వాన్ని రద్దు చేసేదన్నారు.

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, వైఎస్సార్‌ఎస్‌యూ అధ్యక్షుడు దత్తసాయి పాల్గొన్నారు.

వెన్నుపోటు చంద్రబాబు నైజం: మాజీ డిప్యూటీ సీఎం అంజద్

వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజమని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. వైఎస్ జగన్ దిశ చట్టం, నామినేటెడ్ పనుల్లో, పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తే...కూటమి ప్రభుత్వం 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని, ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి మోసం చేసిందన్నారు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడు దల చేస్తామని చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట బకాయిలు ఇవ్వకుండా విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ‘యువత పోరు’కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రామయ్య గోపురంపై శాస్త్రోక్తంగా స్వర్ణ కలశ ప్రతిష్ట



స్వర్ణకలశంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న పాంచరాత్ర ఆగమ సలహాదారు రాజేష్ కుమార్, అర్చకులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయ మహా సంప్రోక్షణ మహోత్సవాల్లో భాగంగా శనివారం టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారు రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో విమాన గోపురంపై శాస్త్రోక్తంగా స్వర్ణ కలశాన్ని ప్రతిష్ఠించారు. ముందుగా సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులకు సహస్రనామ కలశాభిషేకానికి సిద్ధం చేసిన 1001 కలశాలలో పంచామృతాభిషకాలు నిర్వహించారు. అనంతరం స్వర్ణ కలశాన్ని విమాన గోపురంపై శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. సాయంత్రం 6 గంటల నుంచి కళాపకర్షణ, శయ్యాదివాసం, ప్రధాన మూర్తి హోమం, శాంతిహోమం, పూర్ణాహుతి, శాతుమొర నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, తులసి గజమాలలు, ఆభరణాలతో అలంకరించి కన్నుల పండుగగా ఊంజల్ సేవను నిర్వహించారు.

మహిళా సాధికారతే ధ్యేయం

ఇన్‌ఛార్జి మంత్రి సవిత

కడప సెవెన్‌రోడ్స్: మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత అన్నారు. శనివారం కడపలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు చేస్తోందని పేర్కొన్నారు. సంపద సృష్టిలో మహిళలు భాగస్వాములు కావాలన్నారు. ఈ ఏడాది లక్ష మంది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నది లక్ష్యమని తెలిపారు. కలెక్టర్ డాక్టర శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ అన్ని కార్పొరేషన్ల ద్వారా మహిళలకు రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం బ్యాంకుల ద్వారా రూ. 1500 కోట్లు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఆడబిడ్డల చదువును ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మహిళలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు. ప్రభుత్వం మహిళల రక్షణకు అనేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ మహిళలు స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నారు. ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు శ్రీలక్ష్మి, ఆనంద్‌నాయక్, కిరణ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నేత శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణాల పంపిణీ:
జిల్లాలోని 983 స్వయం సహాయక సంఘాల్లోని 9830 మంది సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 105,59,00,000 మంత్రి చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. అలాగే 69 మంది ఎస్సీ వర్గాలకు చెందిన ఎస్‌హెచ్‌జీ లబ్ధిదారులకు సబ్సిడీతో కూడిన వడ్డీ లేని రుణాలు రూ. 1,08,50,000, పీఎం విశ్వకర్మ యోజన కింద 542 మంది మహిళా చేతి వృత్తుల వారికి రూ. 3,07,00,000, నలుగురు ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తలు ప్రేరణ సఖి కింద ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతి చెక్కులను మంత్రి అందజేశారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత, కలెక్టర్ తదితరులు

బీసీ వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యత

కడప సెవెన్‌రోడ్స్: వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో ఆమె పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలు తీసుకున్న లబ్ధిదారులు యూనిట్ల స్థాపనకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్‌హెచ్‌జీ పథకాల యూనిట్ల స్థాపనకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేలకు సమాచారం అందించాలన్నారు. ఆప్కో వస్త్రాలయాల్లో అమ్మకాలను మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని హాస్టళ్లలో సన్నబియ్యంతో వండిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకట సుబ్బయ్య

చింతకొమ్మదిన్నె : స్థానిక ఉటుకూరు వద్ద జాతీయరహదారిపై బైక్ అదుపుతప్పి గంప. వెంకట సుబ్బయ్య(70) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. శనివారం ఉదయం 8.30 గంటలకు కడప సిటీ, నడింపల్లె నివాసి గంప వెంకట సుబ్బయ్య వృతి రీత్యా బెల్దారి మేస్త్రి. కడప నుంచి రాయచోటి(జమాల్‌పల్లె) వైపునకు 39ఎస్‌బీ 2260 నెంబర్ గల మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఉటుకూరు వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి సమీపంలోని శుభమ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా రోడ్డుపై కుక్కను తప్పించబోయి వాహనం స్పీడ్ కంట్రోల్ చేయలేక రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్నాడు. తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య గంప చిన్నక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

600 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

బద్వేలు అర్బన్ : బద్వేలు – మైదుకూరు రహదారిలోని చెన్నంపల్లె సమీపంలో 600 బస్తాల రేషన్ బియ్యం లోడుతో వెళుతున్న లారీని అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున చెన్నంపల్లె సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా జమ్మలమడుగులోని ఓ రైస్‌మిల్ నుండి చెన్నైకి బియ్యం లోడుతో వెళుతున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం లారీని స్టేషన్‌కు తరలించి పట్టుబడిన బియ్యం శాంపిల్స్ తీసి రెవెన్యూ అధికారులకు పరీక్ష నిమిత్తం పంపనున్నట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు. ఈ దాడుల్లో అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 6053 కేసులు పరిష్కారం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి





మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, దంపతులతో మాట్లాడుతున్న జడ్జి సత్యకుమారి

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి 6053 కేసులు పరిష్కరించారు. జిల్లావ్యాప్తంగా 16 బెంచీలు ఏర్పాటు చేశారు. కడపలో 5, ప్రొద్దుటూరు 3, రాజంపేటలో 3, రాయచోటిలో 2, బద్వేల్‌లో 2, జమ్మలమడుగు ఒక బెంచీని ఏర్పాటు చేశారు. జిల్లా కోర్టు ఆవరణంలో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి ఆధ్వర్యంలో సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్‌లు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి దీనబాబు, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్, సివిల్ జడ్జి కం చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కె. ప్రత్యూషకుమారి, సివిల్ జీసి ఆసిఫా సుల్తానా, ఎక్సైజ్ కోర్టు జె హేమస్రవంతి, మొబైల్‌కోర్టు మెజిస్ట్రేట్ ఎం. ఆశాప్రియ, కడప బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.. గుర్రప్ప, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు పాల్గొన్నారు.

- జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 6053 కేసులను పరిష్కరించారు. ఈ కేసుల పరిష్కారంతో రూ.15,58,91,342 (రూ.15 కోట్లు 58 లక్షలు,91 వేలు, 342) కక్షిదారులకు నష్టపరిహారంగా లభించింది.
- మొదటి అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో వున్న ఎంవిఓపి నెంబర్: 98/2017 కేసులో రూ. 23 లక్షలు మొత్తాన్ని వాది అయిన సయ్యద్ నీలోఫర్, ఇతరులు, ప్రతివాది అయిన హెచ్‌డిఎఫ్‌సీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వారు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అయ్యారు.. ఈ కేసులో వాది తరపున న్యాయవాది వై.. ప్రసాద్, ప్రతి వాది తరపున న్యాయవాది డి. రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ సభ్యులు, కక్షిదారులు వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి వారి వారి కేసులను పరిష్కరించుకున్నారు.

లోక్ అదాలత్‌లో ఒకటైన భార్యభర్తలు

ప్రొద్దుటూరు క్రైం : మనస్పర్ధలతో ఏడాది నుంచి విడిగా ఉన్న భార్యభర్తలు జడ్జి సత్యకుమారి సూచనతో లోక్ అదాలత్‌లో ఒకటయ్యారు. వివరాల్లోకి వెళితే.. ప్రొద్దుటూరుకు చెందిన సాంబశివారెడ్డి, వీణ అనే దంపతులు మనస్పర్ధలతో ఏడాదిగా విడిగా ఉంటున్నారు. ఇరువురి కులాలు వేరైనా ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఇరువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే వీరి సంసారంలో చిన్నపాటి వివాదాలు తలెత్తాయి. భర్త దూరం కావడంతో భార్య శనివారం ప్రొద్దుటూరులోని కోర్టు హాల్‌లో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను ఆశ్రయించారు. రెండవ జిల్లా అదనపు న్యాయమూర్తి సత్యకుమారి ఇరువురిని పిలిపించారు. తల్లిదండ్రులు విడిగా ఉండటం వల్ల ఏడాది వయసున్న చిన్నారిపై భవిష్యత్తులో ఎంతో ప్రభావం చూపుతుందన్నారు. ప్రేమించుకున్నప్పుడు కులాలు లేవని ప్రస్తుతం వాటిని అధికమించి అన్యోన్యంగా జీవించాలని ఇరువురిని కోరారు. న్యాయమూర్తి సూచనతో సాంబశివారెడ్డి తన సతీమణితో కలిసి జీవిస్తానని అంగీకరించారు. భార్యభర్తలు ఇరువురు కలుసుకోవడంతో జడ్జితోపాటు ఇతర లోక్ అదాలత్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెషన్స్ కర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాది బందెల ఓబులేసు, లోక్ అదాలత్ సభ్యుడు శ్రీనివాసులు, న్యాయవాదులు విజయలక్ష్మి, పద్మజ, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంలో న్యాయ విజ్ఞాన సదస్సు



మహిళా దినోత్సవం న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తులు, న్యాయవాదులు

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టుల ఆవరణంలోని న్యాయసేవాసదన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి మాట్లాడుతూ 1975లో ఐక్యరాజ్యసమితి మహిళా దినోత్సవాన్ని గుర్తించిందన్నారు. మహిళల హక్కులు, లింగ సమానత్వం గురించి అవగాహన పెంచడం, వివిధ రంగాలలో మహిళల విజయాలు మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దీనబాబు, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూషకుమారి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జీసీ ఆసిఫా సుల్తానా, ఎక్సైజ్‌కోర్టు మెజిస్ట్రేట్ జె.హేమస్రవంతి, మొబైల్‌కోర్టు మెజిస్ట్రేట్ ఎం. ఆశాప్రియ, కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి. గుర్రప్ప, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మహిళలు, పారా లీగల్ వాలంటీర్‌లు, ప్యానెల్ న్యాయవాదులు, ప్రజలు తదితరులు ఎ

చౌకబారు రాజకీయాలతో కాలయాపన

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్ కుమార్ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి

వేంపల్లె : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో చౌకబారు రాజకీయాలతో కాలయాపన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్ కుమార్ రెడ్డి ఆరోపించారు. శనివారం వైఎస్సార్ జిల్లా వేంపల్లెలో ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి చనిపోతే ఆ వ్యక్తిని కూడా చిల్లర రాజకీయం కోసం 45 నిమిషాలపాటు కేబినెట్ సమావేశంలో మాట్లాడావంటే నీ స్థాయి ఎటువంటిదో ప్రజలందరికీ అర్థమవుతుందన్నారు. చంద్రబాబు నాయుడు ఒక గొప్ప మిషనరీగా ప్రాజెక్టు చేయబడ్డావని దేశమంతా కూడా ఎదురు చూస్తున్నటువంటి రోజులు ఉన్నాయని చెప్పి అందరూ చెప్పుకునేవాళ్లు.. అయితే ఎక్కడికి పోయింది నీ పరిపాలన దక్షత అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎటువంటి అవినీతి జరగకుండా సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాలు డైరెక్ట్‌గా అందజేసినటువంటి గొప్ప నాయకుడు అన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా రూ.2.80వేల కోట్లు ప్రజల ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. రాష్ట్రానికి 750 మెడికల్ కాలేజీ సీట్లు తీసుకొని వస్తే వాటిని వద్దని వెనక్కి రాసి ఇచ్చిన దౌర్భాగ్య ప్రభుత్వం కాదా మీది అన్నారు. అలాగే మెడికల్ కళాశాలలు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి వ్యాపారం చేయడం ఇంత కన్నా దౌర్భాగ్యం ఉంటుందా అని విమర్శించారు. సామాన్య విద్యార్థులకు ఉన్నత విద్యనభ్యసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ కళాశాలను మంజూరు చేస్తే వాటికి నిధులు ఇచ్చుకోలేక పేద విద్యార్థులపైనే ఆర్థిక భారం పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రతి కార్యక్రమంలోనూ కమీషన్లు వచ్చేది వాస్తవం కాదా అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల నుంచి సామాన్య ప్రజలు ఏమి కొనుగోలు చేయాలన్నా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వ్యాపారవృద్ధి పరంగా 30 శాతం వ్యాపారాలు కూడా జరగలేని పరిస్థితి ఉందన్నారు. ఏదో సంపద సృష్టితారని గొప్పలు చెప్పుకున్న సీఎం చంద్రబాబు అన్ని రంగాల్లో ఘోర వైఫల్యం చెందారని తెలిపారు. మీ పత్రికలు, చానళ్ల దుష్ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. వివేకా హత్య కేసులో జగన్ సతీమణి భారతి, నారాయణ యాదవ్‌తోపాటు చనిపోయిన ఐసి గంగిరెడ్డి, అభిషేక్ రెడ్డి పేర్లను చేర్చిన విషయం స్మృతి చంద్రబాబుది అని అన్నారు. షర్మిలమ్మ కూడా చంద్రబాబు ట్రాప్‌లో పడి జగన్‌పై విమర్శలు చేయడం శోచనీయమన్నారు.

రహదారుల నాణ్యతలో రాజీకి తావులేదు

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



మంత్రి జనార్దన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : రహదారులను అభివృద్ధి చేయడంలో నాణ్యతా ప్రమాణాల రాజీకి తావులేదని, అధికారులు చిత్తశుద్ధితో సకాలంలో పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కడప ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. గుంతల రోడ్ల మురమ్మతు పనులపై అధికారులను ఆరా తీశారు. జిల్లాలో 219 పనులకు గాను రూ. 35 కోట్లు కేటాయించగా, 97 శాతం పనులు ఇప్పటికి పూర్తి చేశామని అధికారులు తెలిపారు. కడప బైపాస్‌కు 14 కిలోమీటర్లు గుంతలు పూడ్చడానికి ఒప్పందం పూర్తయిందని, త్వరలో పనులు చేపట్టి పది రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఇర్కాన్ సర్కిల్ నుంచి ఊటుకూరు వరకు ఐదు కిలోమీటర్లు గుంతలు పూడ్చే పనులు ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా అధికారులు మంత్రిని ఘనంగా సత్కరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

– ఫ్రూట్ జ్యూస్ దుకాణంపై దూసుకెళ్లిన లారీ



లారీ దూసుకెళ్లడంతో దెబ్బతిన్న ఫ్రూట్ జ్యూస్ దుకాణం

ఎర్రగుంట్ల : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని ఏపీజీబీ బ్యాంకు సమీపంలో తృటిలో ప్రమాదం తప్పింది. ఓ ఫ్లెయాష్ లారీ పక్కనే ఉన్న ఫ్రూట్ జ్యూస్ బండిపై దూసుకెళ్లింది. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు . పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపంలోనే ఓ బ్రాందీ షాపు ఉంది. ఇక్కడ రోడ్డు పక్కనే కొందరు మద్యం సేవిస్తుంటారు. బ్యాంకుకు, ఇక్కడ ఉన్న మూడు ఏటీఎం సెంటర్లకు ఖాతదారులు వస్తుంటారు. మద్యం ప్రియుళ్లతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే మద్యం దుకాణం కిందనే ఓ ఫ్రూట్ జ్యూస్ బండి కూడా ఉంది. శనివారం ముద్దనూరు రోడ్డులో స్కూటీలో ఓ మహిళ వస్తుండుగా ఆటో ఢీకొంది. ఆ మహిళ కింద పడింది. వెనుక నుంచి ఫ్లెయాష్ లారీ వస్తున్న సమయంలో డ్రైవర్ గమనించి తప్పించ బోవడంతో పక్కనే ఉన్న ఫ్రూట్ జ్యూస్ దుకాణంపై దూసుకెళ్లింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటీ ప్రమాదం జరగలేదు. ఇప్పటికైన మద్యం ప్రియుళ్లను ఇక్కడ నుంచి నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

కడప ఆర్‌సీఎం డయాసిస్‌కు నూతన బిషప్

– రెవరెండ్ సగినాల పాల్ ప్రకాశ్‌ను నియమిస్తూ పోప్ ప్రకటన



సగినాల పాల్ ప్రకాశ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గాలి బాలి

కడప కల్చరల్ : కడప రోమన్ క్యాథలిక్ డయాసిస్ బిషప్‌గా రెవరెండ్ సగినాల పాల్ ప్రకాశ్‌ను నియమించారు. ఈ మేరకు పోప్ ఫ్రాన్సిస్ రోమ్‌లో ప్రకటన చేశారు. శనివారం నగరంలోని మరియాపురంలోని క్యాథడ్రల్ చర్చిలో ఇంత వరకు ఈ ప్రాంత బిషప్‌గా వ్యవహరించిన మోస్ట్ రెవరెండ్ డాక్టర్ గాలి బాలి నూతన బిషప్ సమక్షంలో పోప్ ఆదేశాల మేరకు ఆయన పేరు ప్రకటించారు. త్వరలో ఆయన ప్రమాణ స్వీకారం కూడా నిర్వహించనున్నారు.

నూతన బిషప్ వివరాలు :

నూతన బిషప్ రెవరెండ్ పాల్ ప్రకాశ్ సగినాల ప్రస్తుతం హైదరాబాదు సెయింట్ జాన్స్ రీజినల్ సెమినరీలో బైబిల్ స్టడీస్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఆయన 1961 జూన్ 12న వైఎస్సార్ జిల్లాలోని పలుగురాళ్లపల్లెలో జన్మించారు. హైదరాబాదు ఉస్మానియా నుంచి బీఏ డిగ్రీ, అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంనుంచి తెలుగు మాస్టర్స్ డిగ్రీ, ఢిల్లీ యూనివర్శిటీ నుంచి జర్నలిజం పీజీ డిప్లొమా, రోమ్‌లోని అర్బానియా వర్శిటీ నుంచి బైబిల్ థియాలజీలో పీహెచ్‌డీ చేశారు. కడపలోని ఆరోగ్యమాత క్షేత్రం డైరెక్టర్‌గా కూడా సేవలు అందించారు. శనివారం సాయంత్రం క్యాథడ్రల్ చర్చిలో నూతన బిషప్‌గా ఆయన పేరును వెల్లడించిన బిషప్ గాలి బాలి ఆయనకు దేవుని ఆశీస్సులు సంవృద్ధిగా ఉండాలని కోరుతూ హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కడప కథోలిక మేత్రాసన వికర్ జనరల్ రెవరెండ్ ఫాదర్ తలారి బాలరాజు, కోశాధికారి రెవరెండ్ ఫాదర్ సంబటూరు సురేష్ పాల్గొన్నారు.

ఈనెల 10న ఉచిత గ్రహణ మొర్రి పరీక్షలు

కడప ఎడ్యుకేషన్ : బసవతారకం స్మైల్ ట్రైన్ సెంటర్–బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ , సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కడప నగరంలోని భవిత సెంటర్‌లో ఈ నెల 10న ఉచిత గ్రహణ మొర్రి పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి నిత్యానంద రాజులు, సహిత విద్యా సమన్వయకర్త రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ముకుందరెడ్డి గారి ఆధ్వర్యంలో ఉచిత గ్రహణ మొర్రి (పెదవి చిలుక మరియు అంగిలి చిలుక) స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6 నెలల వయస్సు నుంచి 50 సంవత్సరాలు వారు శిబిరానికి హాజరు కావచ్చని పేర్కొన్నారు. సదవకాశాన్ని జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్ట్

చాపాడు : మండలంలోని నక్కలదిన్నె బీసీ కాలనీలో గురువారం ఎర్రబోయిన కళావతి అనే మహిళపై విచక్షణా రహితంగా దాడి చేసిన భర్త ఎర్రబోయిన భాస్కర్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ ఇన్‌చార్జీ టి.భవానీ తెలిపారు. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త భాస్కర్ గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న భార్య కళావతిని మచ్చుకత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. రాబడిని సమాచారం శనివారం ఉదయం 10.30గంటలకు నక్కలదిన్నె గ్రామ పొలాల్లో ఉన్న భాస్కర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌హెచ్‌ఓ చెప్పారు.

మహిళలు ఆదిపరాశక్తి స్వరూపం



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న డా. పి. అరుణమ్మ

- మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సతీమణి అరుణమ్మ
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

కడప కార్పొరేషన్ : మహిళలు ఆదిపరాశక్తి స్వరూపమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి సతీమణి డా. పోచిమరెడ్డి అరుణమ్మ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, కడప నియోజకవర్గ అధ్యక్షురాలు బండి దీప్తి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మొదట వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళలకు తినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజం మహిళలకు ఉన్నత స్థానం కల్పించిందన్నారు. ఆ ఉన్నతిని కాపాడుకునేందుకు పోరాటం చేయాలన్నారు. భవిష్యత్‌లో మహిళలకు అన్ని రంగాల్లో మంచి అవకాశాలు రావాలని ఆకాంక్షించారు. అంతకుముందు మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలందరికీ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళా నేతలంతా అరుణమ్మను, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగంను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు పత్తిరాజేశ్వరి, రత్నకుమారి,ఉమామహేశ్వరి, క్రిష్ణవేణి, తులశమ్మ, హైమవతి, మల్లీశ్వరి, నారాయణమ్మ, జ్యోతి, పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడి ఉంటే ఈ రోజు అప్పులుండేవి కాదు

- ఏదో రకంగా జైలుకు పంపాలనే ఎమ్మెల్యే వరద అసెంబ్లీలో ఆరోపణలు
- రూ.162 కోట్లకు భూములు కొంటే రూ.800 కోట్లు అవినీతి సాధ్యమా?
- విజిలెన్స్ నివేదిక ఇచ్చినా వరద రెడ్ బుక్ రాజ్యాంగం కావాలంటున్నారు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



జగనన్న కాలనీల భూముల కొనుగోలు వివరాల పత్రాలను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ప్రజా సంక్షేమం కోసం దూరదృష్టితో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అవినీతిని ప్రోత్సహించకుండా చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. విచ్చలవిడిగా అవినీతిని అప్పట్లో ప్రోత్సహించి ఉంటే ఈ రోజు తనకు అప్పులు ఉండేవి కాదన్నారు. ఏదో విధంగా అవినీతి పరుడనే ముద్ర వేసి తనను జైలుకు పంపడమే లక్ష్యంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరోపణలు చేస్తున్నారన్నారు. దొరసానిపల్లెలోని తన స్వగృహంలో రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఎమ్మెల్యే వరద తనపై వ్యక్తిగత కక్షతోనే విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి గురించో, పాల కేంద్రం గురించో, ఆగిన డ్రైనేజీ కాలువల నిర్మాణాల గురించో అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడి ఉంటే అందరు సంతోషించేవారన్నారు. అలా కాకుండా కేవలం తనను అవినీతి పరుడని చెప్పేందుకు అసెంబ్లీని వేదికగా చేసుకున్నారన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మొత్తం 200 మంది రైతుల నుంచి భూమిని సేకరించినట్లు తెలిపారు. ఆ పరిహారం మొత్తం రైతుల బ్యాంకుల ఖాతాల్లో అధికారులు జమ చేశారన్నారు.

ఒక్క రైతునైనా చూపించండి

ఎమ్మెల్యే వరద ఉద్దేశ్య పూర్వంగా తాను ఎకర భూమిని రూ.20 లక్షలకు కొని రూ.40 లక్షలకు అమ్మినట్లు ఆరోపణలు చేశారని రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రభుత్వానికి భూములు అమ్మక ముందు భూముల రిజిస్ట్రేషన్ జరిగిందేమో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చెక్ చేసుకోవాలని సూచించారు. సోములవారిపల్లెలో మీ వర్గీయుడైన మాజీ సర్పంచ్ సాంబశివుడు, రామేశ్వరంలో బిజీనేపల్లి సుధాకర్, మీనాపురంలో లక్ష్మిరెడ్డి భూములను ప్రభుత్వం సేకరించిందన్నారు. వారి నుంచి తాను భూములు కొనుగోలు చేసి ప్రభుత్వానికి అమ్మినట్లు నిరూపించాలని కోరారు. తన బావమరిది మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డితోపాటు తాను కూడా పలు మార్లు ఈ విషయంపై ప్రెస్‌మీట్లు పెట్టామన్నారు. తాము వేల కోట్ల అవినీతికి పాల్పడినట్లు ఎన్నికల ముందు ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే అధికారంలోకి వచ్చాక ఎందుకు నిరూపించలేకపోతున్నారన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు నూకా నాగేంద్రారెడ్డి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సత్యం, లావణ్య, జయంతి, డీలర్ అంజి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, వెంకటేష్, రామ్మోహన్‌రెడ్డి, ఖాజాపీర్ పాల్గొన్నారు.